క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



హరికృష్ణకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఆలయ కమిటీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈనెల 8వ తేదీ నుంచి 12 వరకు నిర్వహించనున్న పట్టణంలోని పాత వెంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణకు బుధవారం ఆలయ నిర్వాహకులు ఆహ్వానపత్రికను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొమ్మల యాదగిరి, దాస అంజన్న, డీసీసీ ప్రధాన కార్యదర్శి షాబుద్దీన్, డీసీసీ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, పాత వెంకటేశ్వర స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ మంకాల నవీన్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంటలకు నీరందించండి



తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

దుబ్బాక: రామసముద్రం, నల్లచెరువుల ద్వారా తమ పంటలకు నీరు విడుదల చేయాలని దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చేర్వాపూర్ రైతులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఎండలకు బోర్లు సరిగా పోయక వేసిన వరి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ నీటిని చెరువుల్లోకి వదిలి తమ పంటలకు నీరందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిచో పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు నాయకులు పుర్మ మహిపాల్‌రెడ్డి, మూర్తి నరేష్‌రెడ్డి, మల్లేశం, రాములు, దేవిరెడ్డి, మల్లేశం, బాపురెడ్డి, యాదవరెడ్డి, బాలయ్య, రాజేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

సిద్దిపేటకమాన్: వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని బస్టాండ్ చౌరాస్తాలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సరైన పత్రాలు లేని ఆటోలకు ఎంవీ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

డప్పులతో నిరసన



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం బెజ్జంకిలో ఫ్లెక్సీలు, డప్పులతో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడు పర్శరాములు మాట్లాడుతూ.. సెమీఅక్తర్ నివేదికను సవరించి వర్గీకరణలో నాలుగు గ్రూపులు చేయాలని, మాదిగ ఎమ్మెల్యేలు ఇద్దరికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పర్శరాములు, భూమయ్య, శంకర్, రాజు, రూపేష్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడ్డ కారు వేలం

సిద్దిపేటరూరల్: ఎక్సైజ్ శాఖ వారు స్వాధీనం చేసుకున్న హుందాయ్ క్రెటా కారును 7న ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ అపూర్వరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కారు అప్‌సెట్ ధర రూ. 4 లక్షల 55 వేలు ఉందని, వేలంలో పాల్గొనే వారు 25 శాతం రిఫండబుల్ డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. వేలం పాటలో కారును దక్కించుకున్న వారు 18 శాతం జీఎస్టీ కట్టాలని తెలిపారు.



ఎండిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

పంటలు ఎండిపోకుండా చూడండి

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని దమ్మక్కపల్లిలో ఎండిపోయిన వరి పొలాలు, నీరు లేక బోసిపోయిన కాలువను రైతులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు, రైతులు పెట్టుకున్న ఆశలు ఏడాదిన్నరలోపే అడియాసలు చేసిందన్నారు. కాళేశ్వరం నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా గత ప్రభుత్వం సిద్దిపేట జిల్లాలో మల్లన్న సాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మ సాగర్‌ను నింపుతూ గ్రావిటీ ద్వారా చెరువుల్లోకి నీటిని వదిలి భూగర్భజలాలు పెరిగేలా చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు ఏ ఒక్క రిజర్వాయర్ నుంచి చెరువులకు నీటిని విడుదల చేయలేదన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి తిమ్మారెడ్డిపల్లి, కొండపాక, దమ్మక్కపల్లి, సిర్సనగండ్ల, జప్తినాచారం, మర్పడ్గ, ఖమ్మంపల్లి గ్రామాల్లోని చెరువులను నింపుతూ బందారం, అంకిరెడ్డిపల్లి, దర్గా, దుద్దెడ గ్రామాల్లోని చెరువులకు నీరు వెళ్లేందుకు రాంపల్లి శివారులో ఆగిపోయిన కాలువ తవ్వకం పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. రెండు, మూడు రోజుల్లో తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయకపోతే వేలాది రైతులతో కలిసి రాజీవ్ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, దుర్గయ్య, శ్రీనివాస్, కుమార్, రాధాకిషన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, సురేందర్‌రెడ్డి, రవి, మల్లేశం పాల్గొన్నారు.

వర్గీకరణ లోపాలను సరి చేయండి

ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పరశురాం మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ లోపాలను సరి చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పెర్క పరశురాం మాదిగ పేర్కొన్నారు. బుధవారం ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి శివ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల నియోజకవర్గ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ రిపోర్టుకు ఈనెల 10వరకు గడువు ఉన్నందున గతంలో ఇచ్చిన నివేదికలోని లోపాలను సవరించి ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. మాదిగలకు రెండు మంత్రి పదవులు, ఎస్సీ వర్గీకరణను 3 గ్రూపులుగా కాకుండా ఏబీసీడీలుగా వర్గీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు మైస రాములు, శ్రీహరిసింధు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు అందుబాటులోనే నిర్మించండి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపికతో పాటు ఇంటి నిర్మాణ స్థలం ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ హరికిరణ్, ఎంపీడీఓ జనార్దన్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించరాదన్నారు. ప్రజలకు అనువుగా లేని స్థలాల్లో ఇళ్లు నిర్మించి చేతులు దులుపుకోవద్దని సూచించారు. ఆయన వెంట నాయకులు రాజేష్, ప్రశాంత్, భూపతిరెడ్డి, వెంకట్, వినోద్, నాగరాజు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

త్రీటౌన్ సీఐ విద్యాసాగర్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విద్యాసాగర్

సిద్దిపేటఅర్బన్: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ తల్లిదండ్రులకు సైతం అవగాహన కల్పించాలని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యమని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మహిళలు, పిల్లలపై జరుగుతున్న అకృత్యాల గురించి, పోక్సో కేసుల గురించి వివరించారు. మాయమాటలు చెప్పే వారి మాటలు నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సోనాజ్ సుల్తానా, ఉపాధ్యాయులు, త్రీటౌన్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న కృషి కల్ప సీఈఓ పాటిల్

హుస్నాబాద్: విద్యార్థులు చదువుకునే దశ నుంచే వ్యాపారాల్లో భాగస్వాములు కావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షపతి పిలుపునిచ్చారు. కళాశాలలో ఉద్యమిత్వ నైపుణ్యాల అభివృద్ధి సెల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన యువ ఉద్యమిత్వ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి చొరవతో జిల్లాలోని యువత అంకుర సంస్థలను స్థాపించేందుకు 'కృషి కల్ప'అనే కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. అంకుర సంస్థల స్థాపన వల్ల ఉత్పత్తి, ఉద్యోగ కల్పన, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమ రిసోర్స్‌పర్సన్ కృషి కల్ప సీఈఓ పాటిల్ మాట్లాడుతూ.. విద్యార్థులు సమస్యలపై విభిన్నంగా ఆలోచించినప్పుడే పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నయనాదేవి, కుమారస్వామి, చంద్రమౌళి, బాలరాజు పాల్గొన్నారు.

ఉత్సవాలకు రండి

ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆహ్వానం



హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న ప్రతినిధులు

సిద్దిపేటజోన్: దేవాలయాల ఉత్సవాలు, యంత్ర ప్రతిష్టాపనలో పాల్గొనాలని బుధవారం ఎమ్మెల్యే హరీశ్‌రావును ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. 7 నుంచి 9 వరకు జరుగనున్న అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర దేవాలయ యంత్ర ప్రతిష్టతో పాటు 8 నుంచి 12 వరకు జిల్లా కేంద్రంలోని పాత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరుగనున్న 55వ వార్షికోత్సవంలో పాల్గొనాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పుల్లూరి శివకుమార్, నవీన్ కుమార్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

చెత్తతో ఆదాయం సృష్టించాలి: డీఎల్పీఓ

హుస్నాబాద్‌రూరల్: గ్రామాల్లో సేకరించే చెత్తను ఆదాయ వనరులుగా మార్చుకోవాలని డీఎల్పీఓ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసి సమావేశంలో మాట్లాడారు. నిత్యం చెత్త సేకరించి డంప్ యార్డులకు తరలించి, ఆదాయ వనరుగా వినియోగించుకోవాలని అన్నారు. ప్రజలకు కూడా చెత్త, వ్యర్థాల ద్వారా ఆదాయం సమకూర్చుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. సాహస్ స్వచ్ఛంద సంస్థ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి చైతన్యం చేయడం అభినందనీయమన్నారు. ఎన్జీఓ ప్రతినిధులు కార్యదర్శులకు జూట్ బ్యాగులను అందించారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

కొండపాక(గజ్వేల్): పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించేలా విద్యార్థులను సిద్ధం చేయాలని ఎంఈఓ బచ్చలి సత్తయ్య సూచించారు. మేదినీపూర్, ముద్దాపూర్, కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాలలను బుధవారం సందర్శించారు. పరీక్షలు సమీపిస్తుండటంతో ఎలా చదువుతున్నారంటూ ప్రశ్నించారు. అనంతరం సత్తయ్య మాట్లాడుతూ పరీక్షలు రాసేటప్పుడు ఒత్తిడిలకు గురి కావద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నేతలు



మంత్రి బండి సంజయ్‌ని కలిసిన నాయకులు

ములుగు(గజ్వేల్): కేంద్ర హోంశాఖ వ్యవహారాల సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను బుధవారం గజ్వేల్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు చింతల అరుణ్‌కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సత్కరించారు. గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరినట్లు తెలిపారు. త్వరలోనే నియోజకవర్గం ముఖ్యనేతలతో సమావేశమై అభివృద్ధిపై చర్చించనున్నట్లు సంజయ్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో బీజేపీ నాయకులు కన్నారెడ్డి, సాయికిరణ్ తదితరులు ఉన్నారు.

టెన్త్ విద్యార్థులు సత్తాచాటాలి

ఎంఈఓ ప్రభుదాస్



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ ప్రభుదాస్

దుబ్బాకటౌన్: పది పరీక్షల్లో దుబ్బాక మండల విద్యార్థులు సత్తాచాటి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ ఆకాంక్షించారు. దుబ్బాక పట్టణంలో వేద అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని అభినందించారు. మొదటిర్యాంక్ సాధించిన లచ్చపేట మోడల్ స్కూల్‌కు చెందిన హుస్నోద్దీన్‌ను 1 గ్రామ్ గోల్డ్, 2వ ర్యాంక్ సాధించిన జెడ్పీహెచ్‌స్కూల్‌కు చెందిన సుహానాను 6 గ్రాముల వెండి, 3వ ర్యాంక్ సాధించిన చంద్రికను 4 గ్రాముల వెండి పతకాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి టాలెంట్ టెస్టులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, వేద అకాడమీ డైరెక్టర్ ఉదయకర్ తదితరులున్నారు.

మల్లంరాజు సేవలు మరువలేనివి



మల్లంరాజు విగ్రహాన్ని ఆవిష్కరించిన నేతలు

గజ్వేల్‌రూరల్: సర్పంచ్‌గా, ఎంపీపీగా మల్లం రాజు అందించిన సేవలు మరువలేనివని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొల్గూరులో ఆ గ్రామ మాజీ సర్పంచ్ మల్లంరాజు విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మల్లంరాజు సర్పంచ్‌గా, ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించి తనదైన ముద్రను చాటుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గాడిపల్లి భాస్కర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నీరు లేక ఎండుతున్న పంటలు

గజ్వేల్: మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ కాల్వల ద్వారా సాగునీటిని విడుదల చేయకపోవడంతో రైతుల పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని గజ్వేల్ మాజీ జెడ్పీటీసీ మల్లేశం ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో మండుటెండల్లోనూ గోదావరి జలాల విడుదలతో కాల్వలు, వాగులు జలకళను సంతరించుకున్నాయని అన్నారు. నేడు భిన్నమైన పరిస్థితి నెలకొనడంతో రైతులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారని తెలిపారు. అధికారులకు సమస్యను వివరించినా పట్టించుకునేనాథుడే లేడని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కాల్వల ద్వారా నీటిని విడుదల చేయాలని, లేని పక్షంలో రైతుల పక్షాన ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.



కొండపాకలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

తొలిరోజు ప్రశాంతం

జిల్లాలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలతో పాటు అన్ని మోడల్ స్కూల్స్‌లో పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు 95శాతం హాజరు నమోదు అయింది. పరీక్షల నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించి సూచనలు, సలహాలు అందించారు. అదనపు కలెక్టర్లు అబ్దుల్‌హమీద్, గరిమాఅగర్వాల్ పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.



చేర్యాల(సిద్దిపేట): ముస్త్యాలలో అదనపు కలెక్టర్ హమీద్ ..



పరీక్షకు హాజరైన గురుకుల కళాశాల విద్యార్థినులు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ అనురాధ



మిరుదొడ్డి(దుబ్బాక): పరీక్షా కేంద్రం వద్ద బారులు తీరిన విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

◆ **ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుక**

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి హైస్కూల్లో సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులు సుమారు 75 సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్‌ఎం సముద్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. మూఢనమ్మకాలను దూరం చేసేందుకు సైన్స్ పరిజ్ఞానం ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేందర్ రెడ్డి, మాధవి, ధన్‌గర్, శ్రీనివాస్, యాదగిరి, రాజశ్రీ పాల్గొన్నారు.

◆ **సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ**

గజ్వేల్: వరిలో అగ్గితెగులు, కాండం తొలిచే పురుగు ఉధృతి అధికంగా ఉన్నదని, సస్యరక్షణ చర్యలతో ఈ తెగుళ్లను నివారించుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి నాగరాజు తెలిపారు. బుధవారం గజ్వేల్ మండలం పిడిచెడ్‌లో తెగుళ్ల బారిన పడిన వరి పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. అగ్గి తెగులు సోకిన వరి పైరు ఆకులపై కండే ఆకారంలో ఎర్రటి మచ్చ ఏర్పడి క్రమంగా ముదురు గోధుమ రంగులోకి మారుతుందని, దీనివల్ల ఆకులు ఎండిపోతాయని చెప్పారు. దీని నివారణకు నత్రజని(యూరియా) వాడకాన్ని తాత్కాలికంగా ఆపేయాలని సూచించారు. దీని తర్వాత ట్రైసైక్లోజోన్ మందును 0.6గ్రాములు, లేదా కాసుగా మైసిన్ మందును 1.5మి.లీలు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాండం తొలిచే పురుగు నివారణకు సైతం రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ గణేశ్ పాల్గొన్నారు.

◆ **ఘనంగా పెద్దమ్మ తల్లి ఉత్సవాలు**

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని పెద్దలింగారెడ్డిపల్లి గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న పెద్దమ్మతల్లి 5వ వార్షికోత్సవంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారం హాజరై, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును కుల పెద్దలు ఘనంగా స్వాగతించారు. అనంతరం హరీశ్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉదయశ్రీ, తిరుపతి, ముదిరాజ్ కుల పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

◆ **పాఠశాలకు ప్రింటర్ అందజేత**



చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు జెడ్పీహెచ్‌ఎస్‌కు అదే పాఠశాలలో 1996–97లో 10వ తరగతి చదివిన విద్యార్థులు కలర్ ప్రింటర్ అందజేశారు. బుధవారం పాఠశాలకు వచ్చిన పూర్వ విద్యార్థులు పాఠశాల హెచ్‌ఎం ఎం.ఐలయ్య సమక్షంలో ప్రింటర్ అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

◆ **ఘనంగా వీడ్కోలు సమావేశం**

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని శనిగరం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల బుధవారం వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు సరళ మాట్లాడుతూ.. పదవ తరగతి పరీక్షలు కష్టంతో కాకుండా ఇష్టంగా చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **ఉపాధ్యాయులదీ కీలకపాత్ర**



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (బీస్మాట్) ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాకతీయ పాఠశాలలో బుధవారం జరిగిన స్వపరిపాలన దినోత్సవానికి ఆయన హాజరై, మాట్లాడారు. స్వపరిపాలన దినోత్సవంలో తమ తోటి విద్యార్థులకు బోధన చేయడం చిరకాలం గుర్తిండిపోతుందన్నారు. తమకున్న సమయాన్ని, వనరులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులందరూ ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయ విధులు నిర్వహించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **పెద్దమ్మతల్లి ఆశీస్సులు ఉండాలి**

సిద్దిపేటరూరల్: పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెద్దలింగారెడ్డిపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి, డీసీసీ అధికార ప్రతినిధి బుచ్చిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, పూజల గోపికృష్ణ, కెమ్మసారం రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.